GV MALL®
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 105 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 3 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/- మంగళవారం 19 నవంబర్ 2024

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# ఢిల్లీ ఇంకా దేశ రాజధానిగా కొనసాగాలా..?

## :శశిథరూర్ పోస్ట్ వైరల్

■ ఢిల్లీలో కాలుష్యం పెరిగిపోవడంతో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ విమర్శలు గుప్పించారు. ఈ నగరం ఇంకా దేశ రాజధానిగా కొనసాగాలా? అని కేంద్రాన్ని ప్రశ్నించారు.

**దిల్లీ, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యం నానాటికీ పెరిగిపోతోంది. దీనికితోడు పొగమంచు కప్పేయడంతో గాలి నాణ్యతా సూచీ అత్యంత తీవ్రస్థాయికి పడిపోయింది. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పందిస్తూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు.

ఇలాంటి పరిస్థితుల్లో దిల్లీ దేశ రాజధానిగా కొనసాగాల్సి ఉందా అని ప్రశ్నించారు. కాలుష్య నగరాల జాబితా గణాంకాలకు సంబంధించి ఓ టేబుల్ను పోస్ట్ చేసిన థరూర్.. "ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా దిల్లీ మారింది. ఇక్కడ ప్రమాదకర కాలుష్య కారకాలు నాలుగు రెట్లు పెరిగాయి. రెండో అత్యంత కాలుష్య నగరం ఢాకా (బంగ్లాదేశ్ రాజధాని)తో పోలిస్తే దిల్లీలో ప్రమాద స్థాయి 5 రెట్లు ఎక్కువగానే ఉంది. ఇలాంటి విపత్కర పరిస్థితిని కొన్నేళ్లుగా చూస్తున్నా, కేంద్రం మాత్రం దీని గురించి పట్టించుకోవట్లేదు. నవంబరు నుంచి జనవరి మధ్య ఈ నగరం నివాసయోగ్యంగానే ఉండట్లేదు. మిగతా సమయాల్లోనూ అంతంతమాత్రంగానే జీవనం సాగించగలం. ఇలాంటి పరిణామాల మధ్య దిల్లీని ఇంకా దేశ రాజధానిగా కొనసాగించాలా? " అని రాసుకొచ్చారు.



### 500 మార్క్ దాటిన ఏక్యూఐ సూచీ

మరోవైపు, దిల్లీ నగరాన్ని మంగళవారం కూడా పొగమంచు కమ్మేసింది. దీంతో సగటు గాలి నాణ్యతా సూచీ (ఏక్యూఐ) 494కు పడిపోయింది. చాలా ప్రాంతాల్లో ఇది 500 మార్క్ ను దాటిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీంతో వరుసగా రెండోరోజు ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతోంది. పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించని పరిస్థితి నెలకొంది. దీంతో పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ఆలస్యంగా నడుస్తుండగా మరికొన్ని రద్దయ్యాయి. ప్రయాణికులు తమ ప్రయాణాలకు అదనపు సమయం కేటాయించుకోవాలని ఎయిర్లైన్లు అడ్వైజరీ జారీ చేస్తున్నాయి. దిల్లీ వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరిపింది. కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టడంలో అలసత్వంపై ఢిల్లీ సర్కారును ధర్మాసనం నిలదీసింది. తమకు చెప్పకుండా ఆంక్షలు సడలించొద్దని ఆదేశించింది. ప్రస్తుతం దిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతాల్లో జీఆర్ఏపీ-4 లెవల్ ఆంక్షలు కొనసాగుతున్నాయి.

# ఎన్నికలకు ముందు డబ్బు పంపిణీ వివాదం..

## మహారాష్ట్రలో హైడ్రామా


మహారాష్ట్రలోని ఓ హోటల్లో భాజపా ప్రధాన కార్యదర్శి డబ్బు పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో వీడియో షేర్ చేయడంతో వైరల్గా మారింది.



**ముంబయి, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** మహారాష్ట్ర ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాల నడుమ హైడ్రామా నడిచింది. ఎన్నికలకు కొన్ని గంటల ముందు పాల్ఘర్ జిల్లాలోని విరార్ ప్రాంతంలో ఉన్న ఓ హోటల్ లో మంగళవారం భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రజలకు డబ్బు పంపిణీ చేస్తున్నారని ప్రాంతీయ బహుజన్ వికాస్ అఘాడీ పార్టీ ఆరోపించింది. నాలసోపరా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న భాజపా అభ్యర్థి రాజన్ నాయకక్కు ఓటు వేయాలని కోరుతూ భాజపా ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి వినోద్ తాబ్డే, మరికొందరు నాయకులు ప్రజలకు డబ్బు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొంది.నేతలు డబ్బు పంచుతుండగా తమ పార్టీ నేతలు వారిని అడ్డుకున్నారని, వారు ఏర్పాటు చేసుకున్న వేదిక వద్ద నగదు, పార్టీ డైరీలతో కూడిన కవర్లు లభ్యమయ్యాయని బహుజన్ వికాస్ అఘాడీ వెల్లడించింది. దానికి సంబంధించిన వీడియోను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. "ఎన్నికలను ప్రభావితం చేయడానికి భాజపా డబ్బులు పంచుతోంది. పార్టీ అధినేతలు కూడా ఇందులో పాల్గొంటున్నారు. వీరిపై ఎన్నికల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలి" అంటూ రాసుకొచ్చింది.కాగా బహుజన్ వికాస్ అఘాడీ, కాంగ్రెస్ చేసిన ఆరోపణలను భాజపా కొట్టివేసింది. ఎన్నికల వేళ తమ ప్రతిష్టను దిగజార్చడానికి ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయ స్టంట్గా దీనిని అభివర్ణించింది. ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించు క్రమంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకున్నామని.. ప్రతిపక్షాలు డబ్బు కట్టలతో అక్కడికి వచ్చి వీరంగం సృష్టించాయని భాజపా ప్రధాన కార్యదర్శి వినోద్ తాబ్డే అన్నారు. ఈ విషయంపై ఎన్నికల కమిషన్ విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన లోక్సభ ఎన్నికల్లో, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి (ఎంవీఏ) అనూహ్య ఫలితాలు సాధించింది. 48 సీట్లలో ఎంవీఏ 30 స్థానాలను గెలుచుకోగా, అధికార మహాయుతి 17 సీట్లు సాధించింది. బుధవారం జరగనున్న ఎన్నికల్లో మళ్లీ అధికారం దక్కించుకోవాలని ప్రతిపక్షాలు ఎదురు చూస్తున్నాయి. అధికారం చేజారకుండా ఉండేందుకు మహాయుతి వేగంగా పావులు కదుపుతోంది. బుధవారం మహారాష్ట్రలో ఒకే విడతలో భాగంగా మొత్తం 288 నియోజకవర్గాలకు, ఝార్ఖండ్లో రెండో విడతలో భాగంగా 38 నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. 23వ తేదీన కౌంటింగ్ జరగనుంది.

# సోషల్ మీడియాలో వైరల్గా ట్రంప్ డ్యాన్స్..!

● అమెరికా ఎన్నికల ప్రచారం వేళ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ చేసిన డ్యాన్స్ ఇప్పుడు వైరల్గా మారింది.



**నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** అమెరికా 2024 ఎన్నికల్లో విజేతగా నిలిచిన డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడు ఆన్లైన్లో ట్రెండింగ్లో ఉన్నారు. క్రీడాకారులు, సెలబ్రిటీలు ఆయన డ్యాన్స్ను అనుకరిస్తున్న వీడియోలు వైరల్గా మారాయి. ఫుట్బాల్, మిక్స్డ్ మార్షల్ ఆర్ట్స్, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో విజేతలు కూడా సంబరాలు చేసుకున్నవేళ ఈ డ్యాన్స్ చేసి ఫ్యాన్స్ను ఉత్సాహపరుస్తున్నారు.

ఇటీవల న్యూయార్క్ లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్లో జరిగిన యూఎఫ్సీ 309 మ్యాచ్ను వీక్షించేందుకు ట్రంప్ హాజరయ్యారు. ఆయనతోపాటు యూఎఫ్సీ సీఈవో డానా వైట్, ఎలాన్ మస్క్, ఆర్కేఎఫ్ జూనియర్ వంటి వారున్నారు. ఈ మ్యాచ్లో విజయం సాధించిన జాన్ జానెస్ కూడా సంబరాల వేళ ట్రంప్ డ్యాన్స్ చేశాడు. అమెరికాలోని ప్రొఫెషనల్, యూనివర్శిటీ స్థాయి ఫుట్బాల్ మ్యాచ్లో కూడా ఆటగాళ్లు ఈ స్టెప్పులు వేస్తున్నారు. ట్రంప్ బృందం కూడా ఇలాంటి వీడియోలను తమ ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ఎన్ఎఫ్ఎల్లో ట్రంప్ డ్యాన్స్ ట్రెండ్ వేగంగా విస్తరిస్తోంది. లాస్ వెగాస్ రైడర్స్కు చెందిన బ్రాంక్ బోవర్స్, డెట్రాయిట్ లయన్స్కు చెందిన మాల్కమ్ రోడ్రిగస్ వంటి వారు తమ సంబరాల్లో ట్రంప్ స్టెప్పులు వేశారు. ప్రొఫెషనల్ గోల్ఫర్ చార్లీ హుల్ కూడా ఈ స్టెప్ వేసి ఫ్యాన్స్ను రంజింపజేశారు.

# విశాఖలో అత్యాచార ఘటన..

## స్పందించిన హోం మంత్రి అనిత

విశాఖలో లా స్టూడెంట్ అత్యాచార ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు.



**అమరావతి, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** విశాఖలో లా స్టూడెంట్ అత్యాచార ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. విశాఖ పోలీస్ కమిషనర్తో మాట్లాడిన మంత్రి.. ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యాచారానికి పాల్పడ్డ యువకులను కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ మంత్రికి తెలిపారు. విశాఖలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అనిత తెలిపారు.

# అణ్వాయుధాల వినియోగం.. కీలక దస్త్రంపై పుతిన్ సంతకం

అణ్వాయుధాల వినియోగానికి సంబంధించిన నిబంధనలు మరింత సరళతరం చేసే కీలక దస్త్రంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ సంతకం చేశారు.

**మాస్కో నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** ఉక్రెయిన్ పై రష్యా దురాక్రమణ మొదలుపెట్టి వెయ్యి రోజులు పూర్తయిన వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అణ్వాయుధాల వినియోగానికి అనుమతించే నిబంధనలను మరింత సరళతరం చేసే కీలక దస్త్రంపై రష్యా అధ్యక్షుడు పుతిన్ సంతకం చేశారు.



అణ్వాయుధాలు కలిగి ఉన్న దేశం సాయంతో ఏ దేశమైనా తమపై దాడి చేస్తే.. దాన్ని సంయుక్త దాడిగానే పరిగణిస్తామని అందులో పేర్కొన్నారు. తాము అందించే దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యా భూభాగంపైకి ప్రయోగించేందుకు ఉక్రెయిన్కు అమెరికా అనుమతించిన వేళ పుతిన్ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యాపై దీర్ఘశ్రేణి ఆయుధాల వినియోగానికి పశ్చిమ దేశాలు ఆమోదం తెలిపితే... నాటో, అమెరికా, ఐరోపా దేశాలు నేరుగా యుద్ధంలో పాల్గొన్నట్లే భావిస్తామని రష్యా అధ్యక్షుడు పుతిన్ కొన్ని రోజుల క్రితం పేర్కొన్నారు. నాటో సైనిక, సాయుధ సంపత్తిని లక్ష్యంగా చేసుకొని తాము కూడా దాడులు చేస్తామని హెచ్చరించారు. ఇందుకోసం విభిన్నమైన వ్యూహాలను సిద్ధం చేసుకున్నామన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే తన అణు విధానానికి సవరణలు చేసిన రష్యా.. తాజాగా దానిని మరింత సరళతరం చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఒకవేళ పశ్చిమదేశాలు నేరుగా దాడి చేస్తే.. అణ్వాయుధాలు వాడటానికి వీలుగా నిబంధనలు సవరించినట్లు సమాచారం.

# పోలవరం పూర్తయితే కరవుకు చెక్ పెట్టినట్లే: సీఎం చంద్రబాబు

పోలవరం.. రాష్ట్రానికి జీవనాడి.. వెన్నెముక అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే కరవుకు చెక్ పెట్టినట్లే అని తెలిపారు.

**అమరావతి, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** పోలవరం.. రాష్ట్రానికి జీవనాడి.. వెన్నెముక అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే కరవుకు చెక్ పెట్టినట్లే అని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులపై లఘు చర్చలో భాగంగా అసెంబ్లీలో సీఎం మాట్లాడారు.



అమరావతి, పోలవరం ప్రాజెక్టులను రెండు కళ్లుగా భావించినట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కాకూడదనే నిర్మాణ బాధ్యతలు తీసుకున్నామన్నారు. పోలవరం నిర్మాణం ఆలస్యం అవుతుందని.. పట్టిసీమ ద్వారా రైతులకు నీళ్లు ఇచ్చామని తెలిపారు. నీటి సంరక్షణకు చర్యలు తీసుకుందామని.. సాగునీటి సంరక్షణపై సభ్యులంతా అవగాహన పెంచుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# వరంగల్ దశ-దిశ మార్చేందుకు వస్తున్నా: సీఎం రేవంత్

● తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటనకు వెళ్లారు. ఈ నేపథ్యంలో 'ఎక్స్'లో ఆయన ఓ పోస్ట్ పెట్టారు.



**హైదరాబాద్, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటనకు వెళ్లారు. ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల్లో పాల్గొనేందుకు బేగంపేట ఎయిర్పోర్టు నుంచి ఆయన బయల్దేరి వెళ్లారు. ఈ నేపథ్యంలో 'ఎక్స్'లో ఆయన ఓ పోస్ట్ పెట్టారు. "తెలంగాణ చైతన్యపు రాజధాని.. కాళోజీ నుంచి పీవీ వరకు.. మహనీయులను తీర్చిదిద్దిన నేల.. స్వరాష్ట్ర సిద్ధాంతకర్త.. జయశంకర్ సార్కు జన్మనిచ్చిన గడ్డ.. హక్కుల కోసం వీరపోరాటం చేసిన సమ్మక్క - సారలమ్మలు నడయాడిన ప్రాంతం.. దోపిడీకి వ్యతిరేకంగా.. పిడికిలి బిగించిన చాకలి ఐలమ్మ యుద్ధ క్షేత్రం వరంగల్. వీరందరి స్ఫూర్తితో.. మనందరి భవిత కోసం వరంగల్ దశ-దిశ మార్చేందుకు నేడు వస్తున్నాను" అని రేవంత్ పేర్కొన్నారు.

# తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ జీవో రద్దు చేసిన హైకోర్టు

తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసింది.

**హైదరాబాద్, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసింది. సెక్షన్ 10ఏ ప్రకారం తీసుకొచ్చిన జీవో 16ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్లను గతంలో ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని.. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరుద్యోగులు హైకోర్టులో సవాల్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు ఇది విరుద్ధమని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. విచారణ చేపట్టిన హైకోర్టు జీవోను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలోని మొత్తం 40 విభాగాల్లో ఉన్న 5,544 కాంట్రాక్టు ఉద్యోగులను గత ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 2,909 మంది జూనియర్ లెక్చరర్లు, 184 మంది జూనియర్ లెక్చరర్లు (ఒకేషనల్), 390 మంది పాలిటెక్నిక్, 270 మంది డిగ్రీ లెక్చరర్లు, సాంకేతిక విద్యాశాఖలో 131 మంది అటెండర్లు, వైద్య ఆరోగ్యశాఖలోని 837 మంది వైద్య సహాయకులు, 179 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 158 మంది ఫార్మాసిస్టులు, 230 మంది సహాయ శిక్షణ అధికారులు ఉన్నారు.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# దిల్లీ కాలుష్యం ఎఫెక్ట్.. వర్చువల్‌గా జడ్జీల వాదనలు:సీజేఐ

దిల్లీలో వాయు కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో భారత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కీలక సూచనలు చేశారు.

**దిల్లీ, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** దేశ రాజధానిలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో సుప్రీంకోర్టు భారత సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కీలక సూచనలు చేశారు. దిల్లీలో వాయు కాలుష్యం పెరుగుతున్నందున వీలైతే జడ్జీలు వర్చువల్‌గా వాదనలు వినిపించాలని సూచించినట్లు వెల్లడించారు.



కాలుష్య అంశం చేయి దాటిపోయిందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టులో ఆందోళన వ్యక్తం చేశారు.జీఆర్పీఏ-4 పరిమితులను పరిగణనలోకి తీసుకొని దిల్లీలోని కోర్టులు పూర్తిగా వర్చువల్ విధానాన్ని అనుసరించాలని సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, గోపాల్ శంకరనారాయణన్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థించారు. దీంతో ఏ కేసులైనా సరే లాయర్లు వర్చువల్ మోడ్లో లో పాల్గొని తమ వాదనలు వినిపించొచ్చని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. దిల్లీలో వాయుకాలుష్యం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రజలు తీవ్రమైన కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నారు. మంగళవారం సగటు గాలి నాణ్యతా సూచీ 494కు పడిపోయింది. చాలా ప్రాంతాల్లో ఇది 500 మార్కు దాటిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీనివల్ల ఇప్పటికే పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాయు కాలుష్యంపై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ఢిల్లీ ప్రభుత్వంపై మండిపడింది. రోజురోజుకు వాయు నాణ్యత క్షీణిస్తున్నా అధికారులు అలసత్వం ప్రదర్శించడం వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తంచేసింది. కాగా కాలుష్యం నేపథ్యంలో ఇప్పటికే ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆన్లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు.

# వివేకా హత్య కేసు.. వైకాపా ఎంపీ అవినాష్ రెడ్డికి సుప్రీం నోటీసులు

■ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైకాపా ఎంపీ అవినాశడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

**దిల్లీ, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైకాపా ఎంపీ అవినాశ్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అప్రూవర్ను శివశంకర్రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి బెదిరించాడని వివేకా కుమార్తె సునీత తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోర్టుకు తెలిపారు. ఈ కేసులో శివశంకర్రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డికి నోటీసులు ఇచ్చింది.





అవినాశ్ బెయిల్ రద్దు చేయాలంటూ సునీత వేసిన పిటిషన్పై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. మరోవైపు తమపై నమోదు చేసిన కేసులను క్వాష్ చేయాలని సునీత, ఆమె భర్త రాజశేఖర్రెడ్డి, సీబీఐ ఎస్పీ రాంసింగ్ దాఖలు చేసినా పిటిషన్పైనా విచారణ జరిగింది. వివేకా హత్య కేసు పరిణామాలను లూథ్రా కోర్టుకు వివరించారు. ప్రతివాదులకు సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సునీత, రాజశేఖర్రెడ్డి, రాంసింగ్ సుప్రీంను ఆశ్రయించారు.

# అసెంబ్లీకి వచ్చిన నర్రెడ్డి సునీత...
## వివేకా హత్యకేసు పురోగతిపై ఆరా

ఏపీ అసెంబ్లీకి మాజీ మంత్రి వైఎస్ వివేకానంద కుమార్తె నర్రెడ్డి సునీత వచ్చారు.



**అమరావతి, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ అసెంబ్లీకి మాజీ మంత్రి వైఎస్ వివేకానంద కుమార్తె నర్రెడ్డి సునీత వచ్చారు. అసెంబ్లీలోని సీఎం చంద్రబాబు కార్యాలయానికి వెళ్లారు. సీఎంవో అధికారులను కలిసి వివేకా హత్యకేసు పురోగతిపై ఆరా తీశారు.

# వైకాపా హయాంలో 450 ఎత్తిపోతల పథకాలు మూత : మంత్రి నిమ్మల రామానాయుడు

రాష్ట్రంలోని ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించామని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలోని ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించామని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఐదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రంలో 450 ఎత్తిపోతల పథకాలు మూతపడ్డాయని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల కనీస నిర్వహణను కూడా గత పాలకులు పట్టించుకోలేదని ఆక్షేపించారు. ఎత్తిపోతల పథకాలు, పూడికతీతలపై శాసనసభలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ మంత్రి మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్వహణకు ఏడాదికి రూ.983 కోట్లు కేటాయించాలని ప్రణాళికా సంఘం స్పష్టంగా చెప్పిందన్నారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం కేవలం రూ.125కోట్లు మాత్రమే కేటాయించిందని చెప్పారు. అందుకే జలవనరుల శాఖలో ఇంత విధ్వంసం జరిగిందన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొంటామని వివరించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుర్రపుడెక్క తొలగించేందుకు జూన్ లో తొలుత రూ.79కోట్లు కేటాయించామన్నారు. అత్యవసర పనుల కోసం రూ.284 కోట్ల నిధులు మంజూరుచేశామని.. ప్రస్తుతం టెండరు ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. త్వరలోనే ఆ పనులు కూడా చేపడతామని మంత్రి వివరించారు.

# వైకాపా హయాంలో చంద్రబాబుపై మహాకుట్ర :కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

వైకాపా హయాంలో తెదేపా అధినేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు పై మహాకుట్ర జరిగిందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి ఆరోపించారు.

**అమరావతి, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా హయాంలో తెదేపా అధినేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు పై మహాకుట్ర జరిగిందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి ఆరోపించారు. ఓ టీవీ ఛానల్ చర్చలో విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ దీనిపై చాలా స్పష్టంగా చెప్పారన్నారు. స్కిల్ డెవలప్మెంట్ విభాగంలో పొరపాటు జరిగిందని తానెప్పుడూ చెప్పలేదని ఆయన తెలిపారని కోటంరెడ్డి వివరించారు. "చంద్రబాబును జైల్లో పెట్టేందుకు ఫైళ్లను మాయం చేశారని పీవీ రమేశ్ చెప్పారు. స్కిల్ డెవలప్మెంట్, సీఐడీ, సీఎంవోలో ఏక కాలంలో ఫైళ్లు మాయమయ్యాయని.. సీఎంవోలోని పెద్దల జోక్యం ఉంటేనే అది సాధ్యమవుతుందని స్పష్టంగా పేర్కొన్నారు. తన వాంగ్మూలంతో చంద్రబాబును అరెస్ట్ చేసినట్లు అవాస్తవాలు చెప్పారని పీవీ రమేశ్ వెల్లడించారు. దీనిపై విచారణ జరిపించాలని గతంలో డీజీపీకీ ఆయన లేఖ రాశారు. దీనికి డీజీపీ స్పందించారా? లేదా? అనేది తేల్చాలి. ఈ అంశంపై సభలో చర్చించాలి. ప్రభుత్వం దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలి" అని కోటంరెడ్డి కోరారు.



# అధికారులు తప్పు చేసినా చర్యలు తీసుకుంటాం : హైడ్రా కమిషనర్ రంగనాథ్

**అమీన్ పూర్ మున్సిపాలిటీలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు.**

**సంగారెడ్డి, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** అమీన్‌పూర్ మున్సిపాలిటీలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. వెంకరమణ కాలనీ, శంభునికుంట, అమీన్పూర్ పెద్ద చెరువు, హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ, పద్మరావు నగర్ సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించిన రంగనాథ్.. స్థానికులతో మాట్లాడారు.



అక్కడ భూములు ఆక్రమించి వేసిన లేఅవుట్లు, ఇతర సమస్యలపై పలువురు స్థానికుల రంగనాథ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. "అమీన్పూర్ పెద్ద చెరువుకు సంబంధించి అనేక ఫిర్యాదులు అందాయి. పెద్ద చెరువు అలుగులు, తూములు మూసేయడంతో ఎఫ్ఎఎల్ పెరిగిందని బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రత్యేకమైన టెక్నికల్ బృందంతో సర్వే చేయిస్తాం. సర్వే నివేదిక ఆధారంగా ప్రభుత్వంతో చర్చించి మూడు నెలల్లో ఫలితాలతో మళ్లీ వస్తాం. పద్మావతి లేఅవుట్కు సంబంధించి కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆక్రమణలకు పాల్పడ్డారని కొందరు మా దృష్టికి తీసుకొచ్చారు. పార్కులు, రోడ్ల కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేసి నిజం అని తేలితే హైడ్రా చర్యలు తీసుకుంటుంది. అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మరిన్ని ప్రాంతాల్లో ఇదే తరహాలో రోడ్లు, పార్కులు, చెరువులు కబ్జాకు గురైనట్లు అన్ని ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వాటన్నింటిపైనా పూర్తిస్థాయి విచారణ చేస్తాం. అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూమి ఎక్కువగా ఉండడంతో కబ్జాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. చెరువుల పునరుద్ధరణ అనేది ప్రధాన అజెండగా పెట్టుకున్నాం. ఆక్రమణకు గురైన రోడ్లను కూడా పునరుద్ధరిస్తాం. ఆక్రమించిన వారు ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అధికారులు తప్పు చేసినట్లు విచారణలో తేలితే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం" అని కమిషనర్ వెల్లడించారు.

# గురుదక్షిణ కోసం శారదా పీఠానికి భూములు :మండలిలో జగన్ పై మంత్రుల ధ్వజం

ప్రజాహితం కోసం కాకుండా గురుదక్షిణ పేరిట గత ప్రభుత్వం విలువైన భూములను కారుచౌకగా శారదా పీఠానికి కేటాయించిందని మంత్రులు అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు.

**అమరావతి, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** ప్రజాహితం కోసం కాకుండా గురుదక్షిణ పేరిట గత ప్రభుత్వం విలువైన భూములను కారుచౌకగా శారదా పీఠానికి కేటాయించిందని మంత్రులు అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు.



కేటాయింపుల్లో అన్ని నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు. శాసన మండలి ప్రశ్నోతరాల సమయంలో శారదాపీఠం భూకేటాయింపులపై తెదేపా సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. అయితే.. గురుదక్షిణ పదం వాడటంపై ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. కేటాయింపుల్లో ఉల్లంఘనలు ఉంటే చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. అయితే.. నిబంధనలు ఉల్లంఘించి గురువుకు ఇచ్చిన దాన్ని గురుదక్షిణే అంటారని మంత్రులు పేర్కొన్నారు.

# తెదేపా నేతపై దాడి కేసు .. వల్లభనేని వంశీ అనుచరుల అరెస్ట్

కృష్ణా జిల్లా గన్నవరం తెదేపా నేత కాసనేని రంగబాబుపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు..



**గన్నవరర, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** కృష్ణా జిల్లా గన్నవరం తెదేపా నేత కాసనేని రంగబాబుపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహనరంగాతో పాటు మరికొందరు ఉన్నారు. కేసు వివరాల్లోకి వెళితే.. గతంలో వైకాపాలో ఉన్న రంగబాబు ఎన్నికలకు ముందు తెదేపాలో చేరారు. దీన్ని జీర్ణించుకోలేని వంశీ అనుచరులు గన్నవరం సమీపంలోని పార్క్ ఎలైట్ హొటల్ వద్ద ఆయనపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో రంగబాబుకు గాయాలయ్యాయి. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొలం విషయమై మాట్లాడేందుకు పిలిచి దాడి చేశారని ఫిర్యాదులో రంగబాబు పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వం ఈ కేసును నీరుగార్చింది. తాజాగా ఈ కేసు విచారణలో కదలిక వచ్చింది. నిందితులు ఓలుపల్లి మోహనరంగా, అనగాని రవి, భీమవరపు రాము, ఎం. బాబు, సూరపనేని అనిల్, పొన్నూరు సీమయ్య, గుర్రం నానిలను అరెస్ట్ చేశారు. నిందితులను కంకిపాడు పీఎస్కు తరలించి విచారిస్తున్నారు.

# కాంగ్రెస్ సంబరాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు: ఎంపీ ఈటల

కాంగ్రెస్ సంబరాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని మల్కాజ్‌గిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు.



**హైదరాబాద్, నవంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** కాంగ్రెస్ సంబరాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని మల్కాజ్గిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కాంగ్రెస్ అబద్ధాల పునాదుల మీద రేవంత్రెడ్డి పాలన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ప్రజలు చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వం ముచ్చర్లలో ఫార్మాసిటీకోసం 19వేల ఎకరాలు భూ సేకరణ చేసేందుకు ప్రయత్నించింది. ఫార్మాసిటీలను రద్దు చేస్తాని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చారు. ఫోర్త్ సిటీకోసం 30వేల ఎకరాలు అంటున్నారు. ఫోర్త్ సిటీ కోసం రైతుల పొట్ట కొడుతున్నారు. ఫార్మా సిటీ రద్దు అన్నారు.. కొడంగల్లో ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు. లగచర్లలో మా మీద దాడి జరగలేదని కలెక్టరే చెబుతున్నారు. అయినా, రైతులను నానా హింసలకు గురి చేస్తున్నారు. ఎనిమిది నెలలుగా నిరసన తెలుపుతున్న వారిని గుర్తించి పోలీసులు వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. లగచర్ల రైతులు నక్సలైట్లా? వాళ్లేమైనా సంఘ విద్రోహ శక్తులా? నర్మదా, సబర్మతి నదుల్లాగే మూసీ అభివృద్ధి జరగాలి.. అందుకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. మూసీ ఇరువైపులా ఇళ్లను కూల్చి భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోంది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేరుతున్నాయా? అనేది ముఖ్యమంత్రే చెప్పాలి. ప్రధాని మోదీని విమర్శించే స్థాయి సీఎంకు ఉందా? రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? మీ మేనిఫెస్టో ఏమయ్యింది? మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ ఇస్తామన్నారు.. ఇచ్చారా? రేవంత్రెడ్డి సీఎం అయ్యాక అత్యధికంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నది ఆటో డ్రైవర్లు. బెల్టు షాపులు రద్దు చేస్తామన్నారు ఏమైంది? రాష్ట్రంలో లిక్కర్ ఏరులై పారుతోంది. రాష్ట్ర ప్రజలకు ఏమిచ్చారని సంబరాలు చేసుకుంటున్నారు?" అని ఈటల రాజేందర్ ప్రశ్నించారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1992 : అంతర్జాతీయ పురుషుల దినోత్సవం
- 1828 : ఝాన్సీ రాజ్యానికి రాణి ఝాన్సీ లక్ష్మీబాయి జననం (మ.1858).
- 1917 : భారతదేశ మొదటి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జననం (మ.1984).(చిత్రంలో)
- 1928 : భారతదేశ మల్లయోధుడు దారా సింగ్ జననం (మ.2012).
- 1954 : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పార్లమెంటు సభ్యుడు చింతా మోహన్ జననం.
- 1975 : భారతీయ నటి, రూపదర్శి సుష్మితా సేన్ జననం.
- 1977 : తుపానుయొక్క ఉప్పెన సృష్టించిన భీభత్సానికి ఆంధ్ర ప్రదేశ్, కృష్ణా జిల్లా లోని దివిసీమ నాశన-మయింది.
- 1995 : సంస్కృతాంధ్ర పండితుడు రాంభొట్ల లక్ష్మీనారాయణ శాస్త్రి మరణం (జ.1908).
- 2007 : కథకుడు, కవి, రంగస్థల కళాకారుడు పులికంటి కృష్ణారెడ్డి మరణం (జ.1931)


ఝాన్సీ లక్ష్మీబాయి


ఇందిరాగాంధీ


దారా సింగ్


చింతా మోహన్


సుష్మితా సేన్


దివిసీమ


పులికంటి కృష్ణారెడ్డి

## ఓటీటీలోకి వచ్చేసిన ధృవ సర్జా యాక్షన్ థ్రిల్లర్.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!


**ధృవ సర్జా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మార్టిన్'. ఇప్పుడీ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది.**



ధృవ సర్జా, వైభవి శాండిల్య నటించిన చిత్రం 'మార్టిన్' ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన థ్రిల్లర్ యాక్షన్ ప్రియులను మెప్పించింది. ఇప్పుడీ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. ఆహా వేదికగా అందుబాటులోకి వచ్చింది. ఈవిషయాన్ని తెలుపుతూ ఆ ఓటీటీ సంస్థ పోస్టర్ విడుదల చేసింది. అర్జున్ సర్జా కథను అందించిన ఈ చిత్రానికి ఏపీ అర్జున్ దర్శకత్వం వహించారు. కథేంటంటే: అర్జున్ (ధృవ సర్జా) ఓ పోర్టులో కస్టమ్స్ ఆఫీసర్గా విధులు నిర్వర్తిస్తుంటాడు.నిజాయతీ, దేశభక్తి ఉన్న అధికారి. ఈయన ఓ ఆపరేషన్ కోసం పాకిస్థాన్ వెళ్లాల్సివస్తుంది.అక్కడికి వెళ్లాక అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటాయి. తానెవరన్నది కూడామరిచిపోతాడు. తనెవరో కనుక్కునే క్రమంలోనే, తనకి సాయం చేసిన వాళ్లంతా అంతవ-వుతుంటారు. ఇండియాలోని తన స్నేహితులు కూడా హత్యకి గురవు-తుంటారు. ఆయన్ని ప్రేమించిన ప్రీతి (వైభవి శాండిల్య) ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయి. అతి కష్టంమీద ఇండియాకి తిరిగొచ్చాక అర్జునికి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి? ఈ కథలో మార్టిన్ఎవరు? అతనికీ, అర్జున్కి సంబంధం ఏమిటి? వీళ్లిద్దరి లక్ష్యం ఏమిటనే విషయాలు తెలియాలంటే

## 'పుష్ప2' మరో రికార్డు.. ప్రీసేల్ బుకింగ్స్ పుష్పరాజ్ హవా

**ప్రీసేల్ బుకింగ్స్ 'పుష్ప2' హవా కొనసాగుతోంది. తాజాగా ఓ రికార్డును తన ఖాతాలో వేసుకుందీ చిత్రం.**




'పుష్ప: ది రూల్ విడుదలకు ముందే రోజుకో రికార్డును తన ఖాతాలో వే-సుకుంటోంది. ఇప్పటికే దీని ట్రైలర్ పలు రికార్డులు నెలకొల్పగా.. తాజాగా ప్రీసేల్ బుకింగ్స్ మరో ఘనత సాధించింది. ఓవర్సీస్లో అత్యంత వేగంగా 'పుష్ప2' వన్ మిలియన్ డాలర్ల క్లబ్లోకి చేరింది.సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా మాస్ యాక్షన్ ఎంటర్టైనర్గా ముస్తాబవుతోన్న ఈ చిత్రం కోసం అంతర్జాతీయ ప్రేక్షకులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. డిసెంబర్ 5న వరల్డ్ వైడ్గా విడుదల కానుంది. ఓవర్సీస్లో ఒకరోజు ముందుగా డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. దీంతో ఓవర్సీస్లో ప్రీసేల్ బుకింగ్లో మిలియన్ డాలర్ల మార్కు చేరుకుంది. అమెరికన్ బాక్సాఫీస్లో అత్యంత వేగంగా టికెట్ల ప్రీసేల్ ద్వారానే వన్ మిలియన్ డాలర్ల మార్క్ ను చేరిన సినిమాగా 'పుష్ప2' నిలిచింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 'మరో రోజు.. మరో రికార్డుతో చరిత్ర సృష్టించాడు బాక్సాఫీస్ వద్ద పుష్పరాజ్ హవా కొనసాగుతూనే ఉంటుంది' అంటూ కొత్త పోస్టర్ను విడుదల చేసింది. దీంతో బన్నీ అభిమానులు సంబరపడుతున్నారు. సినిమా రిలీజ్ అయ్యాక మరిన్ని రికార్డులు ఖాయం అంటూ కామెంట్స్ పెడుతున్నారు.ఇదీ చదవండి: కడప దర్గాకు ఎప్పటికీ రుణపడి ఉంటా : రామ్చరణ్ ఇక అమెరికాలో ఏకంగా 3,230 షోలను ప్రదర్శించనున్నారు. విడుదలకు ఇంకా సమయం ఉండడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్ విడుదలైన విషయం తెలిసిందే. అది విడుదలైన నాటి నుంచి ట్రెండింగ్లో ఉంది. 120 మిలియన్ల వ్యూస్ టాప్ వన్లో కొనసాగుతోంది.

## టీమిండియా మెరుగైన ప్రదర్శన చేయాలంటే గంభీర్ ప్రశాంతంగా ఉండాలి: హర్భజన్

**ఆసీస్ త్వరలో ప్రారంభంకానున్న టెస్టు సిరీస్లో టీమ్ ఇండియా బాగా ఆడాలంటే ప్రధాన కోచ్ గంభీర్ ప్రశాంతంగా ఉండాలని మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ సూచించాడు.**



నవంబర్ 22 నుంచి ప్రారంభం కానున్న బోర్డర్-గావస్కర్ ట్రోఫీటీమ్ ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కు కీలకం కానుంది. ఎందుకంటే అతని మార్గనిర్దేకత్వంలోనే స్వదేశంలో జరిగిన మూడు టెస్టుల సిరీస్లో కివీస్ చేతిలో భారత జట్టు వైట్వాష్కు గురైంది. దీంతో టీమ్ ఇండియా ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ అవకాశాలు సంక్లిష్టం అయ్యాయి. ఆసీస్తో సిరీస్ ను 4-0తో కైవసం చేసుకుంటే భారత జట్టు నేరుగా డబ్ల్యూటీసీ ఫైనల్కు చేరుతుంది. దీంతో ఆస్ట్రేలియా పర్యటనలో టీమ్ ఇండియా తిరిగి విజయపథంలో నడవాలని గంభీర్ కోరుకుంటున్నాడు. ఇందుకోసం వ్యూహాలను సిద్ధం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గంభీర కు భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ కీలక సూచన చేశాడు. కంగారూల గడ్డపై టీమ్ ఇండియా మెరుగైన ప్రదర్శన చేయాలంటే గౌతీ ప్రశాంతంగా ఉండాలన్నాడు. "పెద్ద జట్లకు కోచ్గా ఉండటం చాలా కష్టంతో కూడుకున్నది. ప్రతిఒక్కరూ కుదురుకోవడానికి కాస్త సమయం తీసుకుంటారు. ఫలితాలు బాగా ఉంటే 'చూడండి. గౌతమ్ టీమ్ని గెలిపిస్తున్నాడు' అని అందరూ చెప్పేవారు. ఆస్ట్రేలియాతో సిరీస్ ముఖ్యమైనది, చాలా అంశాలు పరీక్షగా నిలుస్తాయి. గౌతమ్ గంభీర్ కోపం, సహనాన్ని ఈ సిరీస్ పరీక్షిస్తుంది. అతను తన కోపాన్ని నియంత్రించుకోలేడు. ఇలా చేస్తే పెద్ద ఆటగాళ్లు విసుగు చెందుతారు. ఈ టెస్టులో (కోపాన్ని నియంత్రించుకోవడం) గంభీర్ తప్పనిసరిగా పాస్ కావాలి. అతనికి ఈ పర్యటన చాలా కీలకం. ప్రతిఒక్కరికీ ఒక్కో అభిప్రాయం ఉంటుంది. ఇప్పుడు అందరి దృష్టి అతని పైనే ఉంది. ఈ సిరీస్లో గనుక భారత్ మెరుగ్గా ఆడకపోతే విమర్శకులకు గంభీర్ లక్ష్యంగా మారతాడు. గంభీర్ ప్రశాంతంగా ఉండాలని, జట్టు బాగా ఆడాలని నేను కోరుకుంటున్నాను" అని భజ్జీ పేర్కొన్నాడు. సిరీస్లో తొలి టెస్టు పెర్త్ వేదికగా జరగనుంది.

## ఫ్యాషన్

చలిచలి గాలుల్లో వేడి నీటితో స్నానం చేస్తే ఆ హాయే వేరు. అందుకే, చాలా మంది వేడినీటితో స్నానం చేస్తారు ఈ సమయంలో. అయితే, నీటిని వేడి చేసేందుకు ఇదివరకటి రోజుల్లో అయితే కట్టెలు ఉపయోగించేవారు. కాలం మారింది. ఇప్పుడు దీనికోసం గీజర్స్ వచ్చాయి. స్విచ్ వేస్తే చాలు నిమిషాల్లో వేడి నీరు వస్తుంది. కానీ, ఇది కాస్త ఖర్చుతో కూడుకున్న పని. అందుకే, ఎక్కువమంది వాటర్ హీటర్స్‌పై ఆధారపడతారు. ఇది తక్కువధరకే రావడంతో దీనికే ఓటు వేస్తారు. అంతా బానే ఉన్నా... దీనిని వాడేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ప్రాణాలకే ముప్పు. అలాంటి సమస్యలేవీ రాకుండా వాటర్ హీటర్ టలా వాడాలో తెలుసుకోండి.





## స్నానానికి వేడినీటి కోసం వాటర్ హీటర్ వాడుతున్నారా.. ఈ టిప్స్ ఫాలో అవ్వాల్సిందే





### స్విచ్ ఆన్, ఆఫ్ చేయడం..



కొంతమంది వాటర్ హీటర్ ప్లగ్‌లో పెట్టి ఆ తర్వాత బకెట్‌లో పెడతారు. అలా ఎప్పుడు చేయొద్దు. ముందుగా బకెట్‌లో పెట్టి ఆ తర్వాత ప్లగ్‌లో పెట్టాక మాత్రమే స్విచ్ ఆఫ్ చేయాలి. నీరు వేడి అయ్యాక స్విచ్ ఆఫ్ చేసి వాటర్ మీటర్ బయటికి తీశాకే బకెట్‌ని ముట్టుకోవడం మంచిది.

### ఏ బకెట్స్..



చాలా మంది ఏ బకెట్స్‌లో అయితే, ఆ బకెట్స్‌లో వాటర్ హీటర్ పెడతారు. అలా ఎప్పుడు చేయకుండా అల్యూమినియం బకెట్ మాత్రమే వాడండి. అంతేకానీ, ప్లాస్టిక్, ఇనుప బకెట్స్ లాంటివి వాడొద్దు. ప్లాస్టిక్ వాడితే అది కరిగిపోయే అవకాశం ఉంది. అదే ఇనుప బకెట్స్‌కి కరెంట్ షాక్ వచ్చే ప్రమాదముంది.

### ధ్యాసంతా..



అదే విధంగా, వాటర్ హీటర్ వాడేటప్పుడు ధ్యాసంతా దానిమీదే ఉంచాలి. ఎప్పుడు ఆన్ చేయాలి. ఎప్పుడు ఆఫ్ చేయాలని. పూర్తిగా పవర్ ఆఫ్ చేశాకే వేడి అయ్యాయా లేదా అనేది చూడాలి. పొరపాటున మర్చిపోయి వేలు పెట్టకూడదు. దీనిని కచ్చితంగా గుర్తుపెట్టుకోండి

### పిల్లలు ఉంటే..



పిల్లలు ఉన్నప్పుడు వాటర్ హీటర్ సరిగా వాడాలి. లేకపోతే చాలా ప్రమాదం. వాటర్ హీటర్‌ని ఎక్కడపడితే అక్కడ కాకుండా పిల్లలు తిరగని ప్రదేశంలో పెట్టాలి. వీలైతే ఆ రూమ్ తలుపు వేసేయండి. దీంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా ఆపుకోవచ్చు. అదే విధంగా, స్విచ్ వేశాక అటు వైపు ఎవరు కూడా వెళ్ళకుండా చూసుకోవాలి. లేదా స్టౌపై నీటిని వేడిచేయడం మంచిది.

### ఎంత నీరు..



అదే విధంగా, చాలా మందికి నీరు ఎంత వరకూ బకెట్‌లో ఉంచాలి. లెవల్ ఎలా చూడాలనే విషయం సరిగా తెలియదు. కానీ, ఎప్పుడు కూడా బకెట్‌లో నీరు ఎంతవరకూ ఉంచాలనేది వాటర్ హీటర్‌పైనే ఉంటుంది. అంత పరిమాణంలోనే ఉంచాలని గుర్తుపెట్టుకోండి. సరిగా చెప్పాలంటే హీటింగ్ కాయిల్ పూర్తిగా మునిగేలా చూసుకోండి.

